# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

“సిద్ధ యోగీంద్రులు”

ఎన్నో జన్మల పుణ్యం వలన ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తియైన శ్రీ శిరిడీసాయినాధుని సన్నిధి లభించింది మనకు. ఎన్నో జన్మలనుండి మనలను సంస్కరించుకుంటూ వచ్చి ఈ జన్మలో ఆయన లాగానే మనకు మానవ జన్మ ప్రసాదించి, పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు, అనేక మిషలమీద తనవద్దకు లాగేరు సాయి. ఏ మిషమీద సాయిచెంతకు చేరేమో తెలుసుకొని జీవించటం ద్వారా జన్మకు సార్ధకత ఏర్పడుతుంది. “సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవటానికా” అన్నారు సాయిబాబా. “సద్గురువు ధ్యాస లేకుండా గడిపిన ప్రతిక్షణమూ మృత్యువును పేనే తాళ్ళు” అన్నారు మాస్టర్ ఇ.బి. అయితే అసలు సద్గురువును తెలుసుకొని, ఆ ధ్యాసలో గడప గలుగుతున్నామా? అంతకుమించి ఏమిషమీద సాయి తనవద్దకు మనలను లాగేరో తెలుసుకొని జీవించ గలుగుతున్నామా. సాయి చెంతకు చేరుతున్నాము, ఆరాధిస్తున్నాము, భక్తులుగా చెలామణి అవుతున్నాము కాని, సాయి కోరిన విధంగా, మెచ్చేవిధంగా, బాబా లాగిన మిషమీద మాత్రంకాదు. చదువు, ఉద్యోగం, పెళ్ళి, పుత్రులు, సంపద మొదలైనవి పొందాలనే మిష, కష్టాలు, నష్టాలు, బాధలు, రోగాలు తగ్గించుకోవాలనే మన కారణాలమీద బాబాచెంతకు చేరుతున్నాము. అనుకున్నవి జరిగితే సాయి అనుగ్రహించాడని, లేకుంటే సాయి మనపై కినుక బూని అనుగ్రహించటం లేదని, మన కర్మ ఇంతేనని వాపోతున్నాము. బాబా అనుగ్రహంతో పొందలేనిది ఏదీలేదని ఒక ప్రక్క చెబుతూనే, సాయి అనుగ్రహం కన్నా మన ఖర్మే బలీయమై, కష్టాలు తొలగి, కోరికలు నెరవేరటం లేదని భావిస్తాము. సాయి కృపకోసం ఆయన చరిత్ర పారాయణ చేస్తాము, కాని, “గురు అనుగ్రహబలం ముందు గ్రహబలము పనిచేయదు” నీ జాతకంలో బిడ్డలు ఎక్కడవి, నీపై కరుణతో నాశరీరాన్ని కోసి నీకు బిడ్డను ప్రసాదించాను” అన్న సాయి మాటలోని భావము గ్రహించము. పారాయణ పుస్తకం చదివితే కోరికలు తీరుతాయి అని ఆశతో చదువుతాము గాని, “సద్గురువు జీవితచరిత్ర” గ్రంథం వారి సస్వరూపముతో సమానము దానిలోని విషయాన్ని గ్రహించి, పరిణితిచెందేలా చదవటమే పారాయణ అని, తద్వారా మనకర్మ నశించి సద్గురువు కృపకు పాత్రులవుతామని, గ్రహించక, అక్షరాల వెంట కళ్ళను పరిగెత్తించి, గురుకృప పొందాలని ప్రయత్నించి, ఫలించక, కర్మ బలీయమైనదని భావించి, గురుకృపను, తద్వారా గురువును శంకించి వారికి మరింత దూరమై ఖర్మవలయంలో చిక్కి, మరింతగా బాధపడతాము. “మీ భారములు నాపై పడవేయుడు నేను మోసెదను'', “నా సహాయముగాని, సలహాగాని, కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను” అన్న సాయి అభయాన్ని కూడ మరిచి జీవిస్తాము. అందుకనే తప్పకుండా మన ఖర్మే బలీయమై, సాయి చెంతనున్నా, వారి కృపాదృష్టి మనపై ప్రసరిస్తున్నా, మట్టిపై పడిన సూర్యకాంతి ఎలా ప్రతిబింబించలేదో అదే చందాన మనము ఉండిపోతాము. దానికంతటికీ కారణం, సద్గురువు గురించి తెలుసుకోక పోవటం, మీదుమిక్కిలి, ఏమిషమీద తనవద్దకు లాగేరో గ్రహించలేక, మన మిషలు నెరవేర్చుకోవటం కోసం వెంపర్లాడటం జరుగుతున్నది. సృష్టిలో గల ప్రతిప్రాణి, జీవి, చెట్టు, చేమ, చివరకి శిలకు కూడ, వాటిజన్మకు ఒక కారణం ఉంటుంది. అది తెలిసి ఆదిశగా పరిణితి చెందితే ఆయా జన్మలకు సార్ధకత. “నీవు చూసేదంతా కలసి నేను'' అన్న సాయి సూక్తి గమనార్హం. కనుక ''మానవజన్మ సార్ధకత చెందాలంటే సద్గురువును తెలుసుకోవాలి” సాయి తెలియబడలేదు అంటే అందుకు అవరోధముగా నిలచిన మనలోని భావాలు ఏమిటో తెలియాలి. అంటే సద్గురువును తెలుసుకోవటానికి ముందుగా మనగురించి మనము తెలుసుకోవాలి, అసలు సద్గురువు చెంతకు ఎందుకు చేరేమో, ఏమి పొందేమో? ఏమి పొందాలనుకుంటున్నామో, అసలు ఏమి పొందాలో అని తెలియాలి. అలా తెలియాలి అంటే వాటికి అడ్డుగా నిలచిన మనలోని యిష్టా, అయిష్టాల గురించి తెలుసుకోవాలి. మనకు ఇష్టమైనది (సంతోషకరమైనది) ప్రసాదించమని సద్గురువు చెంతకు చేరేవారు, “బాబాకు ఇష్టమైనది” ప్రసాదించమని అడుగుతూ,

